క్లుప్తంగా

పుస్తకాలు అందజేత



పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో సుధాకర్

కాగజ్‌నగర్ టౌన్: ప్రభుత్వ పాఠశాలల ప్రారంభం రోజు విద్యార్థులకు పుస్తకాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈవో వాసాల సుధాకర్ తెలిపారు. బుధవారం మండల ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని వివిధ పాఠశాలలకు కావాల్సిన పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సరిపడా 30 వేల పుస్తకాలు వచ్చాయన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందిచామని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

మూలనపడిన 104 వాహనం



చెట్ల పొదల్లో 104 వాహనం

కాగజ్‌నగర్‌టౌన్: మారుమూల గిరిజన గ్రామాలకు వైద్య సేవలు అందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 104 వాహనాలను ఏర్పాటు చేశారు. గత మూడేళ్ల కిత్రం వాహనాలను రద్దు చేయడంతో అవి మూలకు పడ్డాయి. దీంతో వాహనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి అల్లుకుపోయాయి.

రుద్రారంలో భూభారతి సదస్సు

సిర్పూర్(టి): మండలంలోని రుద్రారం గ్రామంలో తహసీల్దార్ రహీముద్దిన్ ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంఈవోతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 6 నుంచి నిర్వహించే బడిబాట కార్యక్రమంలో గ్రామాల్లో ఉండే బడీడు పిల్ల లను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, సీఆర్‌టీలు తదితరులు పాల్గొన్నారు.

ఎద్దు మృతి

కెరమెరి: మండలంలోని శివగూడ గ్రామానికి చెందిన టీకం అయ్యూ ఎద్దు మంగళవారం రాత్రి మృతి చెందింది. ఇంటి ఎదుట కట్టేసి, ఉదయం లేచి చూసే సరికి ఎద్దు ఉన్నచోటే మృతి చెంది ఉందని రైతు తెలిపాడు. విషాహారం తిన్నదా? లేక పాము కాటు వేసిందో తెలియరాలేదన్నారు. ఎద్దు విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య



శివకృష్ణ (ఫైల్)

చింతలమానెపల్లి: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఇస్లావత్ నరేశ్ తెలిపిన వివరాల మేరకు డబ్బా గ్రామానికి చెందిన లెండుగురె శివకృష్ణ (36) మంచిర్యాల జిల్లాలో సింగరేణి ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అతని భార్య స్నేహతో తరచుగా గొడవలు జరుగుతుండేవి. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. అయినప్పటికీ గొడవలు సద్దుమణగకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి ఇచ్చి న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మృతునికి భా ర్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఒంటరితనం భరించలేక యువకుడు..

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని గొల్లవాడ కాలనీకి చెందిన బండి శ్రావణ్ (32) అనే యువకుడు బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు బండి శ్రావణ్ తల్లిదండ్రులు గతంలో మృతి చెందగా.. కొన్ని సంవత్సరాలుగా ఒంటరిగా ఉంటున్నాడు. సెంట్రింగ్ పని చేస్తూ.. జీవిస్తున్నాడు. ఒంటరితనం భరించలేకనే ఆత్మహత్యకు పాలపడినట్లు పోలీసులు నిర్ధారించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

పాఠ్య పుస్తకానికీ ఓ లెక్కుంది!

- ఆధార్ ఉన్నవారికే పుస్తకాల పంపిణీ
- పక్కదారి పట్టకుండా పకడ్బందీ చర్యలు
- విద్యార్థుల వారీగా ప్రత్యేక సంఖ్య

ఈ నెల 6 నుంచి బడిబాట ప్రారంభం కానుంది. అందుకు జిల్లా విద్యాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. బడులు పునః ప్రారంభం కాకముందే పాఠ్యపుస్తకాలు బడులకు చేరాలనే ఉద్దేశంతో ఈ ఏడాది పదిహేను రోజుల ముందే పుస్తకాలు మండల కేంద్రాలకు చేర్చారు. ప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించాలనే సంకల్పంతో పుస్తకాల పంపిణీ ప్రారంభమైంది. – కెరమెరి



ఎమ్మార్సీలో పంపిణీ చేసేందుకు సిద్ధంగా పుస్తకాలు

విద్యార్థులకు సరిపడా పాఠ్యా పుస్తకాలు సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం పేర్కొంటున్నా ఏటా కొరతగానే ఉంటుంది. పంపిణీ చేయాల్సిన పాఠ్య పుస్తకాలు అక్రమంగా బయటకు తరలుతుండడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతుందని విమర్శలున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని పుస్తకాలు దొడ్డిదారిన పడకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వం అందజేస్తున్న పాఠ్య పుస్తకాలు విద్యార్థులకు చేరేవిధంగా క్రమసంఖ్య కేటాయించింది. దీని ఆధారంగా అది ఏ మండలం, ఏ గ్రామంలో, ఏ విద్యార్థి వద్ద ఉందో తెలుసుకోవచ్చు. కెరమెరి మండలానికి 14,233 పాఠ్యపుస్తకాలు చేరాయి. మండలంలోని మొత్తం 90 పాఠశాలలు ఉన్నాయి. అందులో ఉన్నత పాఠశాలలు 3, ప్రాథమికోన్నత పాఠశాలలు 4, ప్రాథమిక పాఠశాలలు 83 ఉన్నాయి. వాటిలో చైల్డ్‌ఇన్ఫో ప్రకారం 5225 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

క్రమసంఖ్య ఆధారంగా..



పుస్తకాలపై ముద్రించిన ప్రత్యేక సంఖ్యలు

ప్రభుత్వం అందజేస్తున్న పుస్తకాలు ప్రభుత్వ బడుల్లో కాకుండా ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అందజేసే అవకాశం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రతీ పాఠ్యపుస్తకంపై వరుస సంఖ్యను కేటాయించింది. రాష్ట్రంలోని జిల్లాలకు, మండలాలకు ప్రత్యేక కోడ్‌లు నిర్ణయించి వాటి ఆధారంగా పుస్తకాలపై క్రమసంఖ్య ముద్రించింది. వీటిని విద్యార్థులకు అందజేసిన తర్వాత జిల్లా, మండల కోడ్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. మండల విద్యాశాఖ పాఠశాలలకు అందజేసిన వాటి క్రమ సంఖ్య ఆధారంగా ప్రణాళికలు రూపొందించారు. దీని ఆధారంగా బయట పుస్తకం కనిపిస్తే అన్ని వివరాలు క్షణాల్లో తెలిసిపోతాయి. పాఠ్యపుస్తకాలు కావాలంటే విద్యార్థులకు ఆధార్ కార్డు తప్పని సరిగా మారింది. ప్రస్తుతం వాటిపై క్రమసంఖ్యను నమోదు చేయడంతో ఆధార్ కార్డు ఉన్నవారికే పంపిణీ చేస్తారు. విద్యార్థి వివరాలతో పాటు ఆధార్‌కార్డు నమోదు చేసుకోని వారికి పుస్తకాలు నిలిపివేస్తారు. అయితే చాలా మంది వద్ద ఆధార్‌కార్డులు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.

ప్రారంభం రోజే పుస్తకాలు పంపిణీ



పాఠశాలలు ప్రారంభం రోజే పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తాం. చైల్డ్ ఇన్ఫో ఆధారంగా పాఠ్యపుస్తకాలు వచ్చాయి. సంఖ్యా ఆధారంగా పుస్తకాలు వచ్చాయి. ఎవరికి ఎన్ని ఇవ్వాలో నిర్ణయించి వరుస నంబర్ ఆధారంగా ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలు అందజేస్తున్నాం.

– ఆడే ప్రకాశ్, ఎంఈవో, కెరమెరి

సమస్యలున్న రైతులు దరఖాస్తు చేయాలి

- ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వరరావు



దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆర్డీవో లోకేశ్వరరావు

కెరమెరి: భూ సంబంధిత రైతులు ఏవైనా భూ సమస్యలు ఉంటే వెంటనే దరఖాస్తు చేయాలని ఆసిఫాబాద్ ఆర్‌డీవో లోకేశ్వరరావు అన్నారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో భాగంగా బుధవారం మండలంలోని కెలికేలో పాల్గొని మాట్లాడారు. ఏ ఏ సమస్యలకు దరఖాస్తులు స్వీకరిస్తామనే విషయం రైతులకు వివరించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. పాట్నాపూర్, టోకెన్‌మోవాడ్, చాల్‌బాడి, ఖైరీ గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. మొత్తంగా 67 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ భూమేశ్వర్ తెలిపారు. డీటీ సంతోష్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పవన్‌నాయక్, సేవంత, ఇర్ఫాద్, వసంత్, విజయ్, సురేశ్, బాపూరావు, రాజు పాల్గొన్నారు.

పునరావాసం కల్పించండి



దేవిడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రమేశ్

కెరమెరి: దేవుడ్‌పల్లి గ్రామస్తులకు పునరావాసం కల్పించాలని మానవహక్కుల కమిటీ చైర్మన్ రమేశ్ అదనపు కలెక్టర్ డేవిడ్‌ను కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేవుడ్‌పల్లి గ్రామంలో 250 మంది జనాభా నివసిస్తున్నారు. 12 ఏళ్ల క్రితం గ్రామానికి సమీపంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. సౌకర్యాలు కూడా కల్పించారు. కానీ వారిని ఇంకా చేర్పించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పరస్‌వాడ గ్రామంలో కనీస సౌకర్యాలు లేవని, తాగునీరు, రోడ్డు రవాణా సౌకర్యంతో పాటు పాఠశాల భవనం లేకపోవడంతో తిప్పలు తప్పడం లేదన్నారు. ఆయన వెంట ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు.

‘7న ర్యాలీ విజయవంతం చేయండి’

ఆసిఫాబాద్‌అర్బన్: టైగర్‌జోన్ ఏర్పాటును వ్య తిరేకిస్తూ ఈనెల 7న జిల్లా కేంద్రం నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు నిర్వహించే మ హార్యాలీని విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) సంఘం నాయకులు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ ర్యాలీకి జిల్లాలోని ఆదివాసీ ప్రజలతో పాటు అన్ని సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

కొనసాగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం హిందీ పరీక్ష నిర్వహించారు. మొత్తం 8 మంది విద్యార్థులు అందరూ హాజరైనట్లు ఎంఈవో వేణుగోపాల్ తెలిపారు.

బడిబాట విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంఈవో ప్రకాశ్

కెరమెరి: ఈనెల 6 నుంచి ప్రారంభం కానున్న బడిబాట కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలని ఎంఈవో అడే ప్రకాశ్ అన్నారు. బుధవారం మండలంలో ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీవో అంజద్‌పాషా, ఎస్సై మధుకర్ ఆధ్వర్యంలో కొనసాగిన సన్నహక సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు బడిబాటపై ప్రజలకు వివరించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండి ఐదేళ్ల పైబడిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కుమారి, లత, ఎస్సీఆర్‌పీ నరేశ్, సీసీ సత్తయ్య, సీఆర్‌పీలు ఉన్నారు.

నేడు బడిబాటపై గ్రామస్థాయి సమావేశం

కెరమెరి: బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు గురువారం గ్రామ స్థాయిలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎంఈవో ఆడే ప్రకాశ్ తెలిపారు. కార్యక్రమానికి గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు, ఏఏపీసీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడిలు, ఆశా వర్కర్లు, మహిళలు సకాలంలో హాజరు కావాలన్నారు.

సిర్పూర్(టి): తెలంగాణ ప్రభుత్వం ఈనెల 6 నుంచి నిర్వహించనున్న బడిబాట కార్యక్రమంపై బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో వేణుగోపాల్ ఆధ్వర్యంలో జయశంకర్ బడిబాట కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజన వసతి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీఎం దుర్గయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

దహెగాం: బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు చేపడుతున్న బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 6 నుంచి 20 వరకు బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు., ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. గ్రామాల్లోని బడీడు పిల్లలను గుర్తించాలన్నారు. అందరు బడికి వెళ్లేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మినవర్ షరీఫ్, ఎంపీడీవో అల్బర్ట్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో అడ్మిషన్లు

- లింగాపూర్ విద్యాలయం ఇంటర్మీడియెట్ వరకు అప్‌గ్రేడ్
- అందుబాటులో సీఈసీ, ఎంపీహెచ్ డబ్ల్యూ కోర్సులు
- అధ్యాపక పోస్టుల కోసం దరఖాస్తుల ఆహ్వానం



లింగాపూర్ కేజీబీవీ పాఠశాల

లింగాపూర్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఈ సంవత్సరం ఇంటర్మీడియెట్‌కు అప్‌గ్రేడ్ చేశారు. పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన నిరుపేద, మండల కేంద్రానికి చెందిన బాలికలకు కేజీబీవీలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు..

మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇంటర్మీడియెట్‌లో కొత్తగా సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు ప్రవేశపెట్టారు. ఒక్కో కోర్సులో 30 సీట్ల చొప్పున నింపనున్నారు. వీటితో పాటు కేజీబీవీలో ఆరోతరగతి ప్రవేశాల కోసం కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రత్యాకాధికారిణి ప్రసన్న భారతి తెలిపారు. ఆరోతరగతిలో 45 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు దరఖాస్తుతో పాటు స్కూల్ బోనఫైడ్, ఆధార్‌కార్డు, కుల, ఆదాయ, జనన, ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జతపర్చాలని తెలిపారు. సీట్ల కేటాయింపులో అనాథలు, తల్లి, తండ్రి లేని వారికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వివరించారు. పేద, మధ్య తరగతి వారికి, మండల కేంద్రానికి చెందిన వారికి, ఇతర మండలాలకు చెందిన నిరుపేదలకు కూడా ప్రాధాన్యం ఇస్తామన్నారు. పాఠశాల, కళాశాలలో చేరిన విద్యార్థులకు నాణ్యమైన ఉచిత భోజనంతో పాటు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందిస్తామన్నారు.

అధ్యాపక పోస్టుల భర్తీ..

మండల కేంద్రంలోని కేజీబీవీ ఇంటర్మీడియెట్ వరకు అప్‌గ్రేడ్ కాగా అర్హత గల అధ్యాపకుల నుంచి దరఖాస్తులు అహ్వానిస్తున్నారు. తెలుగు -1, ఇంగ్లిష్ -01, సివిక్స్ 1, ఎకనామిక్స్ -1, కామర్స్ -1 పోస్టుల కోసం సంబంధిత కోర్సుల్లో ఎంఏ, బీఈడీ చేసి ఉండాలని, ఈ నెల 8లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఏఎస్‌వో ప్రసన్న భారతి ఒక ప్రకటనలో తెలిపారు.

‘ఆలయ అభివృద్ధికి కృషి

తిర్యాణి: మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జువ్వాజి అనిల్ గౌడ్ అన్నారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించే రేకుల షెడ్డు నిర్మాణం కోసం భూమిపూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి అనేక చర్యలు చేపడుతుందని, మండలంలోని అన్ని ఆలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్, మోకుదెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్ల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మార్క శంకర్ గౌడ్, నాయకులు శంకర్ గౌడ్, వెంకటేశం గౌడ్, జుంగోని అశోక్ తదితరులు ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



నారాయణను సన్మానిస్తున్న నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా కైరిగూడ ఓసీపీలో సేఫ్టీ అధికారిగా పని చేసి భూపాలపల్లి ఏరియాకు మేనేజర్‌గా పదోన్నతిపై వెళ్తున్న అధికారి నారాయణను బుధవారం కై రిగూడ ఓసీపీ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కై రిగూడ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ మాట్లాడుతూ ఓసీపీలో గని ప్రమాదాల నివారణతో పాటు కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా మెరుగైన ఉత్పత్తి సాధించడంలో సేఫ్టీ అధికారిగా నారాయణ ఎంతో కృషి చేశారన్నారు. కార్మికులకు ఎలాంటి సమస్య ఉన్నా తక్షణమే దాన్ని పరిష్కరించి కార్మికుల పక్షపాతిగా నిలిచారని, మేనేజర్‌గా పదోన్నతి పొంది భూపాలపల్లి ఏరియాకు వెళ్తుండడం సంతోషంగా ఉందన్నారు. ఓసీపీకి, బెల్లంపల్లి ఏరియాకు ఆయన అందించిన సేవలు ఎప్పటికి కార్మికుల మదిలో నిలిచి ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శులు కిరణ్‌బాబు, చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి ఓదెలు, జనరల్‌మజ్దూర్ ఇన్‌చార్జి కోటి, శ్రీనివాస్, నాయకులు రమేశ్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో బావిలో పడి వృద్ధుడి మృతి



శవ పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై

బెజ్జూర్: మద్యం మత్తులో బావిలో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన ముంజంపల్లి గ్రామశివారులో చోటు చేసుకుంది. బెజ్జూర్ ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బారెగూడ గ్రామానికి చెందిన చౌదరి ఇస్తారి (74)అనే వృద్ధుడు తన భార్య పుల్లక్క మతిస్థిమితం సరిగా లేకపోవడంతో గత పదేళ్లుగా ఆమెకు సేవలు చేస్తూ.. జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు ఉండగా.. వారు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. చౌదరి ఇస్తారికి మద్యం సేవించే అలవాటు ఉంది. ఈనెల 2న మధ్యాహ్నం ఇంటి నుంచి చెప్రాల వెళ్తానని చెప్పి ఇస్తారి ముంజంపల్లి గ్రామంలో తన స్నేహితుడైన తొర్రెం బానయ్య ఇంటి వద్ద జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యాడు. అక్కడ మద్యం సేవించిన తర్వాత తిరిగి ఇంటికి వస్తుండగా పాలె రామయ్య వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. ఈనెల 3న సాయంత్రం 4 గంటల సమయంలో రాకేశ్ అనే కూలీకి బావిలో శవమై కనిపించాడు. వెంటనే బావి యజమాని పాలె రామయ్యకు సమాచారం ఇవ్వగా.. గ్రామస్తులు అక్కడికి చేరుకొని చౌదరి ఇస్తారిగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వియత్నంలో కాగజ్‌నగర్ వాసి మృతి



అర్షిద్ అశ్రిత్ (ఫైల్)

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రముఖ వ్యాపారి అర్షిద్ అ ర్జున్ కుమారుడు అర్షిద్ అశ్రిత్(21) రోడ్డు ప్రమాదంలో వియత్నం దేశంలో బుధవారం తెల్లవారు జామున మృతి చెందా డు. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం వియత్నం దేశంలో అశ్రిత్ ఎంబీబీఎస్ రెండో సంవత్స రం చదువుతున్నాడు. ఉద యం బైక్‌పై వెళ్తుండగా.. అ దుపు తప్పి పడిపోవడంతో మృతి చెందినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కుమారుడిని తలుచుకొని రోదించారు. హుటాహుటిన వియత్నంకు బయలుదేరి వెళ్లారు.

‘భూభారతి’తో భూసమస్యలు పరిష్కారం



దరఖాస్తులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

లింగాపూర్: రైతుల భూసమస్యల పరిష్కారానికే భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని అడిషనల్ కలెక్టర్ డేవిడ్ అన్నారు. బుధవారం లింగాపూర్ మండలంలోని గుమ్నూర్(బి), పిక్లాతండా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు రికార్డుల ఆధారంగా పరిశీలించి సమస్య పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజుగౌడ్, డిప్యూటీ తహసీల్దార్ పెద్దిరాజు, ఆర్ఐ ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి

నార్నూర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని ఏఎస్పీ కాజల్‌సింగ్ అన్నారు. బుధవా రం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తని ఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఏజెన్సీలో నకిలి విత్తనాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. అనంతరం పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో భాగంగా కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మాస్టర్ తిరుమలేష్‌ను సత్కరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య నేర్చుకోవాలన్నారు. సీఐ రహీంపాషా, సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణ సూత్రాలు పాటించాలి



రక్షణ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న కోటయ్య

రెబ్బెన: ప్రతీ ఉద్యోగి గని ప్రమాదాల నివారణకు రక్షణ సూత్రాలు తూచా తప్పకుండా పాటించాలని గోలేటి సీహెచ్‌పీ హెచ్‌వోడీ కోటయ్య అన్నారు. బుధవారం సీహెచ్‌పీలో స్పెషల్ సేఫ్టీ అవగాహన డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీహెచ్‌పీలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీర్ పి. శ్రీనివాస్‌రెడ్డి, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి ఎంబడి రామయ్య తదితరులు పాల్గొన్నారు.